అవినీతిపరుడికి శిక్షతప్పదు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సీఐడీ అధికారులు శనివారం టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబును అదుపులోకి తీసుకోవడాన్ని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సమర్థిస్తున్నారు. తప్పు చేసిన వారు ఎంత హోదాలో ఉన్నా శిక్ష నుంచి తప్పించుకోలేరని అంటున్నారు. ప్రజల సొమ్మును కొల్లగొట్టే వారికి ఇది గుణపాఠం కావాలంటున్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను రాజకీయం చేయవద్దని ప్రజలు కోరుతున్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబు పీడ ఇన్నాళ్లకు విరగడైందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాబుకు మద్దతు తెలిపే వారు కూడా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని ప్రోత్సహించినట్టు అవుతుందని ఆక్షేపిస్తున్నారు.

–గోపాలపట్నం/మల్కాపురం/సింధియా

చంద్రబాబు చరిత్ర ముగిసినట్టే



పలు ఆర్థిక నేరాల చేసి ఈ సమాజంలో వైట్ కాలర్ నేతగా,మచ్చలేని వ్యక్తిగా రాష్ట్ర ప్రజలను ఇంత కాలం చంద్రబాబు నమ్మించాడు. ఇన్నాళ్లకు ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసిన ఆ ఆర్థిక నేరగాడి అసలు రంగు వెలుగులోకి తెచ్చింది. చంద్రబాబు అసలు రూపం ఇది అని జనానికి తెలిసింది. నేరం చేసిన వారు ఎంత కాలం వ్యవస్థలను మేనేజ్ చేస్తూ రాలేరు.

చైతన్య జిడపల్లి, ఇంజినీరింగ్ విద్యార్థి

సంతోషంగా ఉంది



చంద్రబాబు అనే ఆర్థిక నేరగాడి అసలు రూపం నేటికి బయటపడింది.నిజానికి చంద్రబాబు ఎప్పుడో అరెస్టు కావాలి.. తనకు ఉన్న పలుకుబడితో వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ తప్పించుకుని తిరిగాడు. ఇన్నాళ్లకు సీఐడీ తగిన ఆధారాలతో చంద్రబాబు అరెస్టు చేయడం సంతోషంగా ఉంది. చంద్రబాబుకు సహకరించిన వారిపై ఇలాంటి చర్యలు చేపట్టాలి.

– పుర్రె అప్పారావు, సీనియర్ సిటిజన్

ఇన్నాళ్లకు పాపం పండింది



ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన చంద్రబాబు అరెస్ట్ చట్టబద్ధంగానే జరిగింది. దీనిలో అధికార పార్టీకి సంబంధంలేదని టీడీపీ నాయకులు గ్రహించాలి. రోడ్డు మీదకు వచ్చి గొడవలు చేసినంత మాత్రాన నిజం అబద్ధం అయిపోదు. టీడీపీ నాయకులు వాస్తవాలు గ్రహిస్తే మంచిది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం మాత్రమే కాదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల ద్వారా మరెన్నో అక్రమాలు చేశాడు. ఇన్నాళ్లకు చంద్రబాబు పాపం పండింది.

– నాగవల్లి, దుర్గానగర్, 62వ వార్డు

అక్రమార్కుడు చంద్రబాబు



రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన చంద్రబాబును అరెస్ట్ చేయడం రాష్ట్రానికి శుభ సూచకం. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా అక్రమాలు చేసినందుకే చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. ప్రజాధనాన్ని దోచుకుని లూటీ చేసిన బాబు ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి.

– ఆడారి నాగరాజు, ప్రకాషనగర్, 61వ వార్డు

చట్టానికి ఎవరూ అతీతం కాదు



చంద్రబాబును అన్యాయంగా అరెస్ట్ చేశారంటూ టీడీపీ నాయకులు రోడ్లపై విర్రవీగుతున్నారు. అన్యాయంగా అరెస్ట్ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు. అవినీతికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు సమానమేనని మరోసారి రుజువైంది. చంద్రబాబు వంటి వ్యక్తులపై జాలి చూపడం మాని ప్రజస్వామ్యాన్ని నమ్ముకుంటే బాగుంటుంది.

–కొటాన రవి, కాకరలోవ, 63వ వార్డు

40 ఏళ్ల అనుభవం అవినీతిమయం



టీడీపీ అధినేత చంద్రబాబు 40 ఏళ్ల అనుభవం అవినీతిమయం. దొంగ కాగితాలు సృష్టి దోచిన సొమ్ము ఎలా దాయాలి. ప్రజల సొమ్ము ఏవిధంగా దోచుకోవాలన్న విషయాలపైనే ఉంది. ప్రజలకు మేలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవు. ఇపుడు జరిగిన అరెస్ట్ ఎపుడో చేయాలి. ఇది మంచి పరిణామం.

–ఎం.మణి, గోపాలపట్నం

చట్టపరమైన చర్యల్లో భాగమే...



చంద్రబాబు అవినీతి చేశాడని సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఇది చట్టపరమైన చర్యల్లో భాగమే. అరెస్ట్ చేయడం సమంజసం కాదని ఆందోళన చేపడుతున్న వారు అవినీతి జరగలేదని ఎందుకు చెప్పడం లేదు. ఒక అవినీతిపరుడికి మద్దతుగా నిలిచిన వారు కూడా అవినీతిపరులే అవుతారు.

–జి విజయలక్ష్మి, గోపాలపట్నం

నేరస్తులను అరెస్ట్ చేయడం సహజమే కదా..



నేరస్తులను అరెస్ట్ చేయడం సహజమే కదా... దీని కోసం టీడీపీ నాయకులు ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదు. సామాన్యుడికైతే ఒక లాగ .. ప్రజా ప్రతినిధులకైతే మరోలా చట్టాలు ఉండవుగా.? వందలకోట్లు ప్రజల సొమ్ము దోచుకున్న చంద్రబాబు మంచివాడు ఎలా అవుతాడు..?

– సరోజ, కొత్తపాలెం

ప్రజల సొమ్ము తిన్నవారికి మద్దతా?



ప్రజల సొమ్మును పందికొక్కులా మేసిన వారిని టీడీపీతో పాటు ఇతర పార్టీల నాయకులు ఎలా మద్దతు తెలిపారు. ఈ అరెస్ట్‌ను రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారు. చంద్రబాబుపై ఉన్న అవినీతి కేసులపై పూర్తి స్థాయి విచారణ జరపాలి. అవినీతికి పాల్పడే వారికి భయం కలిగించేలా చర్యలు ఉండాలి.

గంటా రాణి, గోపాలపట్నం

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, మహిళలతో ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి టీడీపీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని పశ్చిమ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం జీవీఎంసీ 63వ వార్డు నుంచి సుమారు 70 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వార్డు ఇన్‌చార్జి పిలకా రామ్మోహన్‌రెడ్డి, సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు రాజు, దేవి సారథ్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీలో చేరిన దేవి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా టీడీపీలో పని చేశానని అయినా తనకు తగిన గుర్తింపు లభించలేదని వాపోయారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, స్థానిక నాయకులు కొట్నాన రవి, ఎలగాడ రాజు, అడపాక అప్పారావు, జి. రమణ మూర్తి, సూరాడ పెంటారావు, గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మట్టితో తయారు చేసిన విగ్రహాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీలు ప్రాధాన్యమివ్వాలని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ పార్కు వద్ద జియ్యాని విజయ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన వినాయక చవితి ఉత్సవాలకు పందిర రాట మహోత్సవాన్ని శనివారం శాస్త్రోక్తంగా జరిపించారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్ పందిరి రాటకు ప్రత్యేక పూజలు చేశారు. నగరంలో కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలంతా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. యూత్ అధ్యక్షుడు జియ్యాని విజయ్ మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి వేడుకగా పూజలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీను పాల్గొన్నారు.



పందిరి రాటకు పూజలు చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారని పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాంతంలో ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, స్థానిక నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, గేదెల మురళీకృష్ణ, మళ్ల శ్రీనివాసరావు, షేక్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్

అభివృద్ధికి పెద్దపీట

గోపాలపట్నం: తమ ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెంలో రోడ్ల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. భగత్‌సింగ్‌నగర్, చంద్రనగర్‌లో రహదారులు, కాల్వల అభివృద్ధి పనులు రూ.52.21 లక్షల జీవీఎంసీ అంచానా వ్యయంతో చేపడుతున్నామని తెలిపారు. అనంతరం యల్లపువానిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గేదెల మురళీ కృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, స్థానిక నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అంతిమయాత్ర వాహనం ప్రారంభం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ఎవరైనా మృతి చెందినా.. నలుగురు మోసే వారు లేకున్నా ఇకపై చింతించాల్సిన అవసరం లేదు. ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా అటువంటి వారికి ఉచితంగా అంతిమయాత్ర వాహనాన్ని ట్రస్టు నిర్వాహకుడు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అందించనున్నారు. ఈ అంతిమయాత్ర వాహనాన్ని కోరమాండల్ శ్మశాన వాటిక ప్రాంగణంలో నిలుపుతారు. ఈమేరకు శనివారం వాహనాన్ని ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు,40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తదితరులు ప్రారంభించారు. బద్రీనాథ్ మాట్లాడుతూ సేవ అంటే ఆనంద్‌కుమార్ అని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని పేద ప్రజల సమస్యలను గుర్తించి అవసరమైన సేవలు ఉచితంగా అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ నిజంగా అభినందనీయులన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆడారి హరీష్, జీవీఎల్ నరేష్,పాట్టిమూర్తి,అంగ రామ్‌ప్రసాద్,రేవళ్ల సత్యనారాయణ,పిలక రాము,పిల్లా కన్నబాబు, కొల్లి నూకరెడ్డి,చుక్క వలరక్ష్మి పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న బద్రీనాథ్ తదితరులు

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను శనివారం పోర్టు అతిథి గృహంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. గవర్నర్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉచితవైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో శనివారం జాన్‌వెస్లీఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత దంత,నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ కంటి, దంత సమస్యలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి,మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మురళీ,సుందర్,రమేష్‌నాయుడు,లక్కీ అమర్ స్కూల్ డైరెక్టర్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం యునైటెడ్ క్రైస్ట్ చర్చి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గుండె, కిడ్నీ, ఎముకల, దంత వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేశారు. తగిన సలహాలు ఇచ్చారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 500 మందికి సేవలందించారు. చర్చి ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కారు బీభత్సం



గుర్తు తెలియని వ్యక్తి వదిలి వెళ్లిన కారు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో కారు నడుపుతూ బీభత్సం సృష్టించాడు. కాలనీలో వేగంగా కారు నడిపి చర్చిలో ప్రార్థనలు ముగించుకుని బయటకు వచ్చిన వ్యక్తిని కారుతో ఢీకొట్టాడు. గాయాలైన వ్యక్తిని పట్టించుకోకుండా కారును మరింత వేగంగా నడుపుకుంటూ వెళ్లి షిప్‌యార్డ్‌కాలనీలో జనసంచారం లేని చోట వదిలి పారిపోయాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. కారు నడిపిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



ఉట్టి కొట్టేందుకు సిద్ధంగా ఉన్న చిన్నారులు

మల్కాపురం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మల్కాపురం యాదవవీధిలో విజ్ఞాన మండలియాదవ్ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. శనివారం పుర వీధుల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను అట్టహాసంగా జరిపారు. నక్కవానిపాలెం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ పాల్గొని స్వామికి పూజలు చేశారు.

కాలనీల అభివృద్ధే లక్ష్యంగా పనులు

విశాఖ విద్య: కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజక వర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు ఏఎస్‌డీ కొత్తరోడ్ దగ్గర తారాకరామా ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మించిన కళావేదికను శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సేవాభావంతో పనిచేసే శ్రీధర్ లాంటి నాయకుడు దొరకడం వార్డు ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో తారకరామా ఎన్‌క్లేవ్ అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కళావేదికను ప్రారంభిస్తున్న పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్

నేరాల నియంత్రణకు సహకరించాలి

సీఐ జీడీ బాబు

మల్కాపురం: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సీఐ జి.డి.బాబు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన నేరాల నియంత్రణపై పలు కూడళ్లలో అవగాహన కల్పించారు. నేరాలు జరిగితే ఎలా స్పందించాలో వివరించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులతో సోదరభావంతో మెలగాలని సూచించారు. ప్రయాణికులు ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే వారితో వాదనకు దిగకుండా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. పలువురు క్రిమినల్స్,అనుమానితులు ఒక్కో సారి ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తారని, అలాగే ఏదో లగేజీ అని గంజాయి బస్తాలు ఆటోల్లో వేస్తారని అటువంటి వారిపై నిఘా పెట్టి తమకు సమాచారం అందించాలన్నారు. అనంతరం రోడ్లపై కాలక్షేపం చేసే యువతకు,మద్యానికి బానిసైన వారికి అవగాహన కల్పించారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ జి.డి.బాబు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

మల్కాపురం: రోడ్డు దాటుతున్న వృద్ధుడిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పాత చెక్‌పోస్టు ఏరియా ప్రాంతానికి చెందిన రామారావు స్థానిక వాటర్ పంప్ హౌస్ వద్ద పని చేస్తున్నారు. రాత్రి విధులకు వెళ్లిన ఆయన గాజువాక ఆర్టీసీ డిపో వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో గాజువాక నుంచి శ్రీహరిపురం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం రామరావును ఢీ కొట్టింది. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు అతడికి సపర్యలు చేసి 108 సాయంతో నగరంలో ఆస్పత్రికి తరలించి,గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ మార్గంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

24వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు శనివారం 24వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు.ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న భక్తులతో పూజ అనంతరం అమ్మవారి చిత్రపటంతో పాటు కుంకుమ పంపించారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



సంపత్ వెంకన్న ఆలయంలో సత్యనారాయణకు డోర్ కర్టెన్లు అందిస్తున్న భక్తులు



కలియుగ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ దశమి సందర్భంగా శనివారం స్థానిక వేంకటేశ్వరుడి ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్యామాచార్యులు నేతృత్వంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. వేంకటేశ్వరుడి గర్భగుడికి శంకుచక్రాలు ముద్రించిన డోర్ కర్టెన్లను ఓ భక్తుడు శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణకు అందజేశారు. పల్లా వెంకటరావు, పల్లా పెంటారావు, కొయ్య జగదీష్, నమ్మి భాస్కర్ తదితర సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రమణ కుమారికి అభినందనలు



రమణకుమారికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న భాస్కరరావు

గోపాలపట్నం: శ్రీకాకుళం అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలిగా నియమితులైన వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణ కుమారిని శనివారం మాధవదారలోని ఆమె నివాసంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఆయనతో పాటు పార్టీ నేతలు అప్పలస్వామి నాయుడు, కె. సత్తిబాబు, కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా రేపు

కంచరపాలెం: ఈ నెల 11న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2023 నిర్వహించనున్నట్లు ప్రభుత్వ నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ నరవలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ మేళా జరుగుతుందని తెలిపారు. ఐటీఐల్లో వివిధ కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ పూర్తి చేయని వారు, ఎలక్ట్రానిక్స్ ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ మేళాకు అర్హులన్నారు. అభ్యర్థులు కంచరపాలెం నరవ ఐటీఐలో ఉదయం 10 గంటలకు నేరుగా హాజరు కావాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

అల్లిపురం : మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేలకు పైగా జరిమానా తప్పదని టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి తెలిపారు. శనివారం ఒక్కరోజే టూటౌన్ పరిధిలో 36 మంది నుంచి కోర్టు రూ.4 లక్షల 10 వేలు జరిమానా విధించిందని పేర్కొన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్ స్కూల్, అంబేడ్కర్ జంక్షన్, అల్లిపురం జంక్షన్‌లలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టబడ్డ వారిని శనివారం నగరంలో స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే న్యాయస్థానాల్లో భారీ జరిమానా తప్పదని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరించారు.